


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

మంగళవారం 11 నవంబర్ 2025 పేజీలు 05


ప్రజావాణి దరఖాస్తులను

## త్వరగా పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**
ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన బచ్చలి ప్రవీణ్ కుమార్ మండలంలోని తుర్కపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మినీ అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణంలోని రడగంబాల బస్తీకి చెందిన ఇల్లందుల రాజమణి తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. (మిగితా..2లో)



ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం

## త్వరితగతిన చేయాలి

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ ప్రతినిధ,నవంబర్10,సూర్య మేజర్ న్యూస్ :**
ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం త్వరితగతిన చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె స్వయంగా హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ( మిగితా...2లో )



ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి

## త్వరగా పరిష్కరించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్**


2లో

ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పారదర్శకంగా పరిశీలించి

## సకాలంలో పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ రాజార్షి షా**

**ఆదిలాబాద్,నవంబర్10,సూర్య మేజర్ న్యూస్**
ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వేగంగా, పారదర్శకంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్ధారించి, పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి, భూభారతి సహా వివిధ విభాగాలకు చెందిన మొత్తం 108 దరఖాస్తులు అందాయని, వాటిని శాఖల వారీగా త్వరితగతిన పరిశీలించి పురోగతి వివరాలు దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు.అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత, కవి అందె శ్రీ మరణవార్తపై కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు రెండు నిమిషాల మౌనం పాటించి సంతాపం తెలిపారు.ఈప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, డిప్యూటీ కలెక్టర్ వంశీ కృష్ణతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




ప్రజావాణి దరఖాస్తులను

## త్వరగా పరిష్కరించాలి

**- ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్**


**ఉట్నూర్ సూర్య మేజర్ న్యూస్ :**
ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉట్నూరు సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ అన్నారు. సోమవారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నేరడిగొండ మండలం నేరడిగొండ గ్రామానికి చెందిన పరశురామ్ తనకు బోర్ వెల్ మంజూరు కోరుతూ అర్జీ సమర్పించారు. ఇంద్రవెల్లి మండలం మార్కగూడ గ్రామానికి చెందిన కొడప భీంరావ్ తనకు కిరాణా దుకాణం లోన్ ఇపించమని కోరుతూ అర్జీ సమర్పించారు. గుడిహత్నూర్ మండలం తోషం గ్రామానికి చెందిన కోహచ్చాడా నారాయణ తనకు గేదల లోన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో అదనపు వైద్యశాఖ అధికారి ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం సందర్శించి ఔషధాలను పరికరాలను పరిశీలించి పరీక్షలు చేయించుకున్నారు. ప్రజావాణికి వచ్చే ప్రజలందరికీ పరీక్షలు చేయించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పత్తి, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ

## సమర్థవంతంగా చేపట్టాలి

**- రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**



**ఆసిఫాబాద్ ప్రతినిధి,నవంబర్ 10, సూర్య మేజర్ న్యూస్ :**
ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని, ఇందులో భాగంగా రైతులు సాగుచేసిన పంటను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలిపారు. మిగితా. 2లో

## వరద రక్షణ కిట్లను అందజేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్,నవంబర్10,సూర్య మేజర్ న్యూస్ :**
జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులకు, భారీ వర్షాలు, వరదలు సంభవించినప్పుడు ఉపయోగపడే రక్షణ కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే రోజుల్లో వర్షాలు, వరదల నుంచి రక్షణ పొందేందుకు ఈ కిట్లు ఉపయోగపడతాయని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడుకునేందుకు అవసరమయ్యే పరికరాలు ఈ కిట్ లో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పి సీఈవో గోవింద్, మండల ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సూర్య
www.suryaa.com
మంగళవారం 11 నవంబర్ 2025

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మొదటి పేజీ తరువాయి...**



తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ తన దరఖాస్తులో అడ్డా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. చెన్నూర్ మండలం ఆస్నాద్ గ్రామానికి చెందిన రామిళ్ళ ప్రమీల తనకు 2013లో ప్రభుత్వం భూమిని పట్టా ఇచ్చిందని, ఇట్టి పట్టాను డిజిటలైజ్ చేసి నూతన పట్టా పాస్ పుస్తకం మంజూరు చేసి తనకు భూమిని చూపించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గవ్వల శంకరయ్య మండలంలోని రెబ్బెనపల్లి గ్రామ శివారులో తన తల్లి నుండి వారసత్వంగా వస్తున్న భూమికి పట్టా మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణంలోని అశోక్ రోడ్ ప్రాంతానికి చెందిన బెజ్జంకి రమ తన భర్త కంచరీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించే వారిని, తనకు పక్షవాతం రావడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, భర్తకు పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన ఆసరి రాజలక్ష్మి నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.



తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కాసర్ల శ్రీనివాస్, మంచు శంకర్ లు తమ దరఖాస్తులో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు దివ్యాంగ పింఛన్ ఇప్పించాలని, ప్రతి నెల సదరం శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషిచేసి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం త్వరితగతిన చేయాలి
### - జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**మొదటి పేజీ తరువాయి..**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీపై అధికారులు వెంటనే స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని



సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సమీక్షించి, సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగాలని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు ఫీల్డ్ విజిట్లు నిరంతరం నిర్వహిస్తూ, పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల ఫేషియల్ రికగ్నిషన్ హాజరు వ్యవస్థ పై పర్యవేక్షణ కఠినంగా ఉండాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలును నిరంతరం పర్యేక్షించాలని ఆదేశించారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనకు సంబంధించి జిల్లాలో చేపట్టనున్న అవగాహన కార్యక్రమాల గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. బాల్యవివాహాల నిర్మూలనపై ప్రజల్లో చైతన్యం పెంచేందుకు విస్తృత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జెడ్పి సీఈవో గోవింద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థినికి
# బ్రాంజ్ మెడల్

**బెల్లంపల్లి, నవంబర్ 10, సూర్య మేజర్ న్యూస్:**

ఆసిఫాబాద్ జిల్లాలో శుక్రవారం జరిగిన జోనల్ స్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో బెల్లంపల్లి కృష్ణవేణి పాఠశాలకు చెందినా కే. దీక్ష 14 సం,, బాలికల విభాగంలో 100 మీటర్ల హార్డిల్స్ పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్ సాధించిందని పాఠశాల డైరెక్టర్ ఈ రవి ప్రసాద్, ప్రిన్సిపల్ యం. రాజా రమేష్ లు ఒక ప్రకటనలో తెలియజేశారు. తదుపరి వారు మాట్లడుతూ విద్యతో పాటు క్రీడలలో పాల్గొనడం ద్వారా మనసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, క్రీడల పట్ల మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని, శారీరక ఆరోగ్యానికి మేలు చేస్తాయని అన్నారు. అనతరం మెడల్ సాధించడానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు సల్పాల సంతోష్ యాదవ్, వడ్నాల మల్లేష్ యాదవ్ ను అభినందించారు.



# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్**

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అర్జీదారుల నుండి దరఖాస్తు స్వీకరించారు. కెరమెరి మండలం ధనోరా గ్రామానికి చెందిన తొడసం బాలు తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కెరమెరి మండలం పిప్రి గ్రామానికి చెందిన నాయుడి ఎల్లక్క తాము సాగు చేసిన కంది, మొక్కజొన్న పంటలు భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్నాయని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ పట్టణానికి చెందిన అన్వరుల్లా హక్ తన పేరిట పట్టగల భూమిని నిషేధిత జాబితా



నుండి తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైనూర్ మండలం పానపటార్ గ్రామానికి చెందిన గిరిజన రైతులు ప్రధానమంత్రి జన్ మన్ పథకం క్రింద పక్కా ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దహెగాం మండలం పీకలగుండం గ్రామస్తులు తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాగజ్ నగర్ మండలం మెట్ ఇందానికి చెందిన తెలంగె లింభారావు తాను సాగు చేస్తున్న భూమికి పట్టా మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కౌటాల మండల కేంద్రానికి చెందిన డి. ముత్తయ్య మండల కేంద్రంలోని వారసంతలో స్వచ్ఛభారత్ క్రింద నిర్మించిన ముత్రశాలలకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వాంకిడి మండల కేంద్రానికి చెందిన దుర్గం శ్యాం రావు ఏజెన్సీ ప్రాంతాలలో బోడు భూములు సాగు చేస్తున్న అర్హులైన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతుల వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# చలో ఉట్నూర్ బహిరంగ సభ ను విజయవంతం చెయ్యాలని

## ఆదివాసి నాయకులు వాల్ పోస్టర్లు విడుదల




**ఇచ్చోడ ,సూర్య మేజర్ న్యూస్**

ఆదివాసీ బచావో లంబాడా హటావో అనే ప్రధాన నినాదంతో గత 30 సంవత్సరాల నుండి పోరాటం చేస్తూన్నా ఆదివాసీ నాయకులు వలస వచ్చిన లంబాలను ఎస్.టి జాబితా నుండి తొలిగించలానే ఏకైక డిమాండ్‌తో ఈ నెల నవంబర్ 23న ఉట్నూర్ కేంద్రంగా ఎంపీడీఓ గ్రౌండ్‌లో ధర్మ యుద్ధం పేరిట ఆదివాసిల భారీ బహిరంగ సభకు అన్ని ఆదివాసీల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ఆదివాసి నాయకులు వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈ సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి ఆదివాసులు పెద్ద మొత్తంలో ఆదివాసీ ప్రజలు తరలి రావాలి అని తెలియచేస్తున్నాము. ఆదిలాబాద్ జిల్లా అంటేనే ఉద్యమాల గడ్డగా పేరు పొందింది అలాంటిది ఉట్నూర్ సభకు భారీ నుంచి అతి భారీగా ప్రజలు తరలి వచ్చి సభను విజయవంతం చేయగలరు. ఈ సభకు అన్ని కుల సంఘాలు ప్రజా సంఘాలు ఉద్యోగ సంఘాలు కలిసి పని చేయాలనీ ఈ సందర్భంగా తెలియచేస్తున్నాము. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేష్, బోథ్ డివిజన్ వర్కింగ్ అధ్యక్షుడు ఆత్రం మహేందర్, ఆదివాసి నాయకులు కోట్నాక్ గణేష్, పెందుర్ కేశవ్, సిదాం మురళీ కృష్ణ, చాహకటి నాగొరవు, నైతం శేఖర్, రాయి సిదాం జంగు మధు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ
# సమర్ధవంతంగా చేపట్టాలి
### - రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి.**

సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాలు, వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ పత్తి, వరి కొనుగోలు ప్రక్రియ రాష్ట్రంలో సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేపట్టాలని, సరిహద్దుల వద్ద అక్రమ రవాణాను అరికట్టాలని తెలిపారు.

జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, జిల్లా వ్యవసాయ, రవాణా, మార్కెటింగ్, పౌరసరఫరాలు, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కొరకు 40 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, కొనుగోలు కేంద్రాలు ఎత్తైన ప్రదేశాలలో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో గోనె సంచులు, ప్యాడి క్లీనర్లు, ట్యాబులు, టార్పాలిన్ కవర్లు సమకూర్చడం జరిగిందని, రైతుల కొరకు త్రాగునీరు, నీడ, మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం రాకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పత్తి కొనుగలు ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అధికారి అశ్వక్ అహ్మద్, వ్యవసాయ శాఖ అధికారి వెంకటి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, రవాణా శాఖ అధికారి రామ్ చందర్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అనంతలక్ష్మి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలి

## రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

**మంచిర్యాల బ్యూరో,సూర్య మేజర్ న్యూస్ :**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పత్తి, వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాలు, వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని, ఇందులో భాగంగా రైతులు సాగుచేసిన పంటను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పత్తి, వరి కొనుగోలు ప్రక్రియ రాష్ట్రంలో సమర్ధవంతంగా చేపట్టాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేపట్టాలని, సరిహద్దుల వద్ద అక్రమ రవాణాను అరికట్టాలని తెలిపారు. 2025-26 ఖరీఫ్ సీజన్ పంటలైన వరి, మక్కజొన్న, పత్తి కొనుగోలు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకువచ్చే సమయంలో పాటించవలసిన నిబంధనలపై రైతులకు అవగాహన కల్పించాలని, రైతుల వివరాలు స్పష్టంగా ట్యాబ్ లలో నమోదు చేసి చెల్లింపు ప్రక్రియ వేగవంతం చేయాలని




తెలిపారు. రాష్ట్రంలో 8 వేల 450 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో 6 వేల 838 కేంద్రాలు ఇప్పటికే ప్రారంభించామని, ఇంకా 1 వేయి 614 కేంద్రాలు త్వరలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. అధికారుల సూచనల ప్రకారం నవంబర్ 3,4 వారాలు కీలక సమయంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ముందుగా పంటల కొనుగోలుకు సంబంధించి నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అధికారులు వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తూ, కొనుగోలు ప్రక్రియ వేగంగా చేయాలని, రైతులకు చెల్లింపులు త్వరితంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.కూలీల లభ్యత, రవాణా సమస్యలు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు, తేమ శాతం నియంత్రణ చర్యలు సమర్ధవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని, పంటలను సమయానికి కొనుగోలు చేయడానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటుందని, సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తుందని, కౌలుదారు రైతుల సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి నాణ్యమైన పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలులో రైతుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 150, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో 97, డి. సి. ఎం. ఎస్. ఆధ్వర్యంలో




63, మెప్మా ఆధ్వర్యంలో 7 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సన్న రకం వడ్లకు బోనస్ ఇస్తున్నందున అంతర్ రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సౌకర్యార్థం

## కంట్రోల్ రూమ్ ఏర్పాటు

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ,నవంబర్ 10, సూర్య మేజర్ న్యూస్ :**

2025- 26 సంవత్సరానికి గాను వరి ధాన్యం కొనుగోలు కొరకు జిల్లాలో



పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఇందులో భాగంగా రైతుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మరావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతు సంక్షేమం కోసం చేపట్టిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా రైతుల సౌకర్యం కొరకు కంట్రోల్ రూమ్ నం.6303928682 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రస్థాయిలో 1967, 1800 4250 0333 నెంబర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులకు అవసరమైన కొనుగోలు కేంద్రాల సమాచారం అందించడంతో పాటు, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతులు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలు, తేమ యంత్రాలు ఇతర అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రపీడీఎస్ బియ్యం అక్రమ రవాణా - ముగ్గురు అరెస్ట్, - 4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

**చింతలమనేపల్లి, నవంబర్ 10, సూర్య మేజర్ న్యూస్:** మండలం గూడెం గ్రామం వద్ద జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా పీడీఎస్ బియ్యం రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. వివరాలు:సంజీవ్, బాలాజీ అంకోడా టీఎస్20 8076 నంబర్ ఎక్సెల్ బైక్‌పై 1.3 క్వింటాళ్లు పీడీఎస్ బియ్యం, మహేష్, టీఎస్20 1087 నంబర్ ఎక్సెల్ బైక్‌పై 1.5 క్వింటాళ్లు పీడీఎస్ బియ్యం, రామయ్య, టీఎస్20బి 3840 నంబర్ ఎక్సెల్ బైక్‌పై 1.2 క్వింటాళ్లు పీడీఎస్ బియ్యం రవాణా చేస్తూ పట్టుబడ్డారు. మొత్తం 4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ,3 ఎక్సెల్ బైక్స్‌ను స్వాధీనం చేసుకుని చింతలమనేపల్లి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల కింద లబ్ధిదారులకు ఉద్దేశించిన పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్,ఎస్ఐరాజు,హెడ్‌కానిస్టేబుల్ మహ్మూద్,కానిస్టేబుళ్లు విజయ్, రమేష్,హోంగార్డు శేఖర్‌లు పాల్గొన్నారు.



# మంచిర్యాలను అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దా

### - జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య

**మంచిర్యాల (భీమారం),సూర్య మేజర్ న్యూస్ :**

మంచిర్యాలను అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని భీమారం






మండలంలోని ఓ. బి.లు, వి. ఓ. ఎ. లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తం నాయక్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అమ్మకు అక్షరామాల కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమం లో భాగంగా నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు నేర్పించుట కొరకు వాలంటీర్ టీచర్స్ ను గుర్తించి ఉల్లాస్ ఆప్ లో నమోదు చేయడం జరిగిందని, నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే ఈ కార్యక్రమంను విజయవంతం చేయడానికి ప్రతి గ్రామ సంఘం నుండి ఇద్దరు ఓ . బి.లు, వి . ఓ . ఎ.లకు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన సి.ఆర్. పి. లచే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామ స్థాయిలో ఉల్లాస్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని, అంకితభావంతో అందరూ కలిసి విజయవంతం చేసి జిల్లాను అక్షరాస్యతలో ప్రథమ స్థానంలో నిలబెట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం , జాబ్ డిస్ట్రిక్ట్ మేనేజర్, ఏ పీ ఎం శ్రీనివాస్ గౌడ్ , మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి కి స్పందన కరువు

**జన్నారం, నవంబర్ 10, సూర్య మేజర్ న్యూస్**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. సోమవారం జన్నారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన ప్రజావాణి కార్యక్రమంలో కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావలసి ఉండగా కేవలం రెండు మూడు శాఖలకు సంబంధించి అధికారులు మాత్రమే హాజరవుతున్నారు. హాజరుకాని అధికారులపై పై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే చీటికిమాటికి అధికారులు డుమ్మా కొడుతున్నారు. ప్రజావాణిలో పాల్గొన్న అధికారుల్లో ఎమ్మార్వో రాజ మనోహర్ రెడ్డి, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మ, బీసీ హాస్టల్ వార్డెన్ రమేష్, విద్యాశాఖ ఎమ్మార్పీ బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



## వలస కూలీలకు భీమిని ఎస్ ఐ సహాయం

**భీమిని, సూర్య మేజర్ న్యూస్:**

భీమిని ఎస్ ఐ ఎం విజయ్ కుమార్ పత్తి తీయడానికి భీమిని మండల పరిసర గ్రాలకు వలస వచ్చిన రాజస్థాన్ నిరుపేద కూలి కుటుంబాలకు సో మవారం సహాయం చేశారు, నెలకు సరిపడా 8 కుటుం బాలకు , కూరగాయల, తల పదికిలోల బియ్యం అందించినారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ప్రవీణ్ కుమార్, దీపిక పాల్గొన్నారు.



# కలెక్టర్ సారు కరుణించండి..!

- పత్తి రైతుకు మిగిలేది మందు డబ్బేనా..?
- పత్తి మిల్లుల చుట్టూ ప్రదిక్షణలు చేసిన పట్టించుకోవడం లేదంటూ రైతుల ఆవేదన
- దళారులు పెత్తనమే నడుస్తుందంటూ మండిపాటు
- ప్రభుత్వం చెప్పేది ఒకటి.. మిల్లర్లు పాటించేది మరొకటి
- స్థానిక వెంకటేశ్వర కాటన్ మిల్ కి వచ్చిన పత్తి రైతుల గోడు





**లక్షెట్టిపేట, నవంబర్ 10, సూర్య మేజర్ న్యూస్ :** పత్తి పండించిన కర్మానికి మాకు మందు డబ్బే దిక్కా..? పత్తిని కొనుగోలు చేయరా? ఇక్కడే ఆత్మహత్య చేసుకోవాలా? అని తమ దయనీయ పరిస్థితిని పట్టించుకునే వారే లేరంటూ పత్తి రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి అమ్ముకునే అవకాశం లేకపోవడంతో అన్నదాతలు ఆవేదనకు గురవుతున్నారు. సోమవారం స్థానిక కరీంనగర్ చౌరస్తా లోని వెంకటేశ్వర కాటన్ మిల్ కు వచ్చిన పత్తి రైతుల గోడు ఇది. వాతావరణ ఆకస్మిక మార్పుల వలన తేమ ఏర్పడితే దానికి అన్నదాతను బలి చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం పత్తికి ప్రకటించిన మద్ధతు ధర కాకపోయినా కనీస రేటు ఎందుకు ఇవ్వడం లేదని ఆక్రోశం వెళ్ళగక్కుతున్నారు. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వర్షానికి తడిసిన పత్తిని కూడా కొనుగోలు చేయాలని, తేమ శాతాన్ని బట్టి రైతులకు సరైన న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. కానీ సీసీఐ అధికారులు రైతులను అధిక తేమ పేరుతో వేధిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

## బారులు తీరిన వాహనాలు...

గత కొన్నిరోజులుగా రైతులు మిల్లుకు తీసుకువచ్చిన పత్తిని అధిక తేమ పేరుతో తూకం వేయకపోవడంతో రోడ్డు పొడవునా పత్తి లోడ్ వాహనాలు బారులు తీరాయి. తక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన రైతులకు వ్యాన్ కిరాయి, వేచి ఉండే సమయం, కూలీని భరించడం తడిసిమోపెడు అవుతోంది. ఒకవైపు కొనుగోలు చేయకు మరో వైపు తమ నెంబర్ ఎప్పుడూ వస్తుందో తెలియక రైతన్నలు ఆకలి దప్పులతో మిల్లు వద్దనే పడిగాపులు కాస్తున్నారు. ఇదిలా ఉండగా తమ కంటే వెనుక వచ్చిన నెంబర్ లకు అధికారులు కాంటా చేస్తున్నారని, దళారుల ప్రమేయంతో ఇలా జరుగుతుందని ఆరోపిస్తున్నారు.

## మద్ధతు ధర పై పట్టింపేది??

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, తేమ శాతం 8 నుంచి 12 వరకు ఉంటే రూ. 8110 చొప్పున క్వింటాల్ కు చెల్లించాలి. ఒకవేళ తేమ శాతం 14 నుంచి 16 మధ్యలో ఉంటే అసలు సీసీఐ అధికారులు తమను పట్టించుకోవడం లేదని, ఒక వైపు వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్ లు 12 కంటే తేమ శాతం ఎక్కువ ఉంటే కూడా కొనుగోలు చేయాలని చెప్పారని రైతులు అంటున్నారు. మంత్రి, కలెక్టర్ మాటలు ఆచరణలో ఎక్కడ కనిపించడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు దళారుల వలన 13 నుంచి 16 శాతం తేమ ఉందని, పత్తిని కొనుగోలు చేయమని చెప్పడంతో రైతులు బయట ప్రైవేట్ వ్యక్తులకు రూ. 6000 నుంచి రూ. 6500 వరకు తప్పనిసరి పరిస్థితిలో అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులకు అండగా నిలువాల్సిన సీసీఐ అధికారులు తమను పట్టించుకోవడం లేదని, పైగా ప్రైవేట్ వ్యక్తుల పత్తి కొనుగోలుకు సహకరిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా కొందరు రాజకీయ నాయకులు, పలుకుబడి కలిగిన వ్యక్తులు తెచ్చిన పత్తిని వెంటనే తూకం వేసి, సీసీఐ అధికారులు మిగతా రైతులను పడిగాపులు కాసేలా చేస్తున్నారని కొందరు రైతులు బాహాటంగా విమర్శిస్తున్నారు. తమకు చదువు రాకపోవడంతో తేమకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేయకుండానే సంతకం చేయాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నట్లు మీడియాకు తెలిపారు. కాగా,ఈ విషయమై మార్కెట్ కమిటీ కార్యదర్శి రాజేశ్వర్ ను వివరణ కోరగా, కేవలం కొనుగోలు కేంద్రం ఓపెనింగ్ రోజు మాత్రమే తేమ శాతం 12 కంటే ఎక్కువ ఉంటే కూడా కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. ఇప్పుడు అలా కొనుగోలు చేయలేమని వెల్లడించారు. రైతులు ఆరోపణల్లో నిజం లేదని కొట్టిపారేశారు.

## విషయం చెప్పకుండానే సంతకాలు తీసుకొని వెళ్ళిపో అంటున్నారు.
## - రైతు, అప్పని సత్తయ్య, గ్రామం లక్ష్మీపూర్



ఆరు క్వింటాళ్ల పత్తికి అరగోస పెడుతున్నారు. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన రైతు అప్పని సత్తయ్య కష్టపడి పండించిన పత్తి పంటను మిల్లుకు తీసుకొస్తే విషయం చెప్పకుండానే సంతకాలు తీసుకొని వెళ్ళిపో అంటున్నారు. విషయం చెప్పడం లేదని నిలదీస్తే.. తేమ శాతం ఎక్కువగా ఉంది కావున రిటర్న్ పంపిస్తాము సంతకం పెట్టుమని బెదిరించారని అన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రైతుకు నష్టం జరగకుండా కొనుగోలు చేయాలని కోరారు.

## పూర్తిగా ఆరిన పత్తిని కూడా కొనడం లేదు.
## - రైతు, రాయుడు, తిక్కన్నపల్లి



పత్తిని పూర్తిగా ఆరబెట్టుకొని తెచ్చిన కూడా తేమశాతం ఎక్కువగా వచ్చింది అంటూ మా పత్తిని కొనడం లేదు. ఎండిన పత్తిని కూడా తేమ పేరుతో వెనుకకు పంపిస్తున్నారని అన్నారు. కానీ దళారులు తెచ్చిన పత్తిని మాత్రం కొనుగోలు చేస్తూ, రైతులు తెచ్చిన పత్తిని తేమ పేరుతో వెనుకకు పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ శాతాన్ని పరిశీలించి ఒకసారి 14, మరోసారి 15 అని చెప్పి మీ పత్తిని కొనుగోలు చేయమని రిటర్న్ పంపించడం జరుగుతుందని సంతకం పెట్టమని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు చొరవ తీర్చుకొని రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

# గిరిజన మహిళకు గర్భస్రావం

### .. సకాలంలో వైద్యం అందక మృతి

**వాంకిడి నవంబర్ 10 ,సూర్య మేజర్ న్యూస్**

గర్భ స్రావం జరిగి సకాలంలో వైద్యం అందక ఓ గిరిజన మహిళ మృతి చెందిన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని చిచ్చుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల మారుమూల గ్రామం ఖాతిగూడకు చెందిన మడావి మారుబాయి(21)కి ఆత్రం సునీల్ అనే వ్యక్తితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి ఖాతిగూడలోని తన తల్లిగారి ఇంట్లోనే ఉంటూ దంపతులిద్దరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా ఎనిమిది నెలల గర్భంతో ఉన్న మారుబాయికి గత నాలుగు రోజుల క్రితం గర్భ స్రావం జరిగింది. ఇంట్లోనే గర్భస్రావం కాగా తర్వాత చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్లలేదు. దీంతో సోమవారం మారుబాయి అస్వస్థతకు గురి కాగా 108 అంబులెన్స్కు సమాచారం అందించారు. గుట్టపైన ఉన్న ఖాతిగూడ గ్రామానికి రోడ్డు మార్గం లేని కారణంగా చొపన్గూడ వద్దనే అంబులెన్సు నిలిపేశారు. కుటుంబ సభ్యులు కలిసి మారుబాయిని ఎత్తుకుని అంబెలెన్స్ వరకు తీసుకు వచ్చారు. అక్కడి నుంచి మండల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు ఆసిఫాబాద్కు తీసుకెళ్ళాల్సిందిగా సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో పరిస్థితి విషమించి మధ్యాహ్నం మార్గ మధ్యలో మృతి చెందింది. కాగా గత ఆగష్టు నెలలో మండలంలోని గోందాపూర్ గ్రామానికి చెందిన దేవబాయి అనే గిరిజన బాలింత సకాలంలో వైద్యం అందక రక్తహీనతతో మృతి చెందిన విషయం తెలిసిందే.. మూడు నెలలు గడవక ముందే మరో గిరిజన మహిళ సకాలంలో వైద్యం అందక మృతి చెందడం శోచనీయంగా మారింది. రహదారి సౌకర్యం లేని కారణంగానే అంబులెన్స్ గ్రామం వరకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. పర్యావసనంగా అత్యవసర సమయంలో వైద్యానికి నోచుకోలేక ఇలాంటి దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఉల్లాస్ శిక్షణతో

### సంపూర్ణ అక్షరాస్యత గ్రామ సంఘంగా మారాలి

**సిర్పూర్ (టి) సూర్య మేజర్ న్యూస్:**

సిర్పూర్ (టి) మండలం ఆదర్శ మండల సమాఖ్య లో ఉల్లాస్ అక్షర వికాసం వయోజన విద్యా అవగాహన కార్యక్రమం ద్వారా ప్రతి వివో సంఘం అక్షరాస్యత యువ సంఘంగా మారాలని ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఓరుగల్లు మహా సమాఖ్య సీనియర్ సిఆర్పిలు కవిత, భారతి గ్రామ సంఘాల లీడర్లకు వివోఏ లకు అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్పీలు మాట్లాడుతూ అన్ని గ్రామాలలో నిరాక్ష రాస్యుల్ని గుర్తించి 100% శాతం అక్షరాస్యత సాధించేలా గ్రామ సంఘం సభ్యురాలు, మండల సమాఖ్య సభ్యురాలు కృషి చేయాలని సూచించారు. చదువుకుంటే కలిగే లాభాలు, చదువు లేకపోతే కలిగే నష్టాలు సమస్యల, గురించి వివరించి వారికి చదువుతో పాటు సంతకాలు కూడా వారికి రావాలని తెలియజేశారు. మహిళలకు చదువు ప్రాముఖ్యత గురించి తెలిపారు. గ్రామ సంఘాల వారి పాత్ర ఏమిటి, మండల సమాఖ్య బాధ్యత ఏమిటి అని చార్ట్ రూపకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య లీడర్లు జి.రాజేశ్వరి అధ్యక్షురాలు,సిహెచ్ పద్మ కార్యదర్శి, కే మమత కోశాధికారి, వివో లీడర్స్, సీసీలు, వివోఏలు తదితరులు పాల్గొన్నారు.



## జన్నారం రెగ్యులర్ రేంజ్ ఆఫీసర్గా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీనారాయణ



**జన్నారం, నవంబర్ 10, సూర్య మేజర్ న్యూస్ :** జన్నారం రెగ్యులర్ రేంజ్ ఆఫీసర్గా లక్ష్మీనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో రెగ్యులర్ రేంజ్ ఆఫీసర్గా బాధ్యతలు స్వీకరించి సొంత పనులపై దీర్ఘకాలిక సెలవులపై వెళ్లిన విషయం విధితమే. మధ్యలో మరొక్కసారి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మళ్ళీ సెలవుపై వెళ్లారు. ఈరోజు ఎట్టకేలకు రెగ్యులర్ రేంజ్ ఆఫీసర్గా బాధ్యతలు స్వీకరించారు. రెండుసార్లు సెలవు పై వెళ్లడంతో ఇంధన్ పల్లి రేంజ్ ఆఫీసర్ హఫీజుద్దీన్ తోపాటు తాళ్లపేట రేంజ్ ఆఫీసర్ సుష్మారావు ఇచ్చార్జీలుగా వ్యవహరించారు. ఇటీవలే జన్నారం ల్యాండ్ సర్వే డిప్యూటీ రేంజ్ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తున్న మమత ఇంచార్జి రేంజ్ ఆఫీసర్గా బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అడవిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని,దొంగ చాటుగా ఎవరైనా కలపను ఇతర ప్రాంతాలకు తరలిస్తే ఊరుకోబోమని, దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఏ సమస్య ఉన్న ఫోనులో గాని నేరుగా గాని చెప్పితే సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు.

## జన్నారం ఇంచార్జి వ్యవసాయ అధికారిగా అంజిత్ కుమార్



**జన్నారం, నవంబర్ 10, సూర్య మేజర్ న్యూస్ :** జన్నారం ఇంచార్జి వ్యవసాయ అధికారిగా గోళ్ళ అంజిత్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దండేపల్లి వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహిస్తున్న గోళ్ళ అంజిత్ కుమార్ ను జన్నారం మండలం ఇంచార్జి వ్యవసాయ అధికారిగా నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో జన్నారం లో బాధ్యతలు స్వీకరించారు. ఇంత కలం పాటు వ్యవసాయ అధికారిగా విధులు నిర్వహించిన కస్తూరి సంగీత పైచదువుల కోసం రెండు సంవత్సరాల పాటు సెలవు పై వెళ్లారు. ఈ సందర్భంగా మండల ఫర్టిలైజర్ యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి వద్ద సీడ్ సెల్ సర్టిఫికెట్ తప్పకుండా ఉండాలని, విత్తనాలను కొనుగోలు చేసే రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని అన్నారు. ఈపాస్ మెషిన్ లో ఉన్న వివరాలను గ్రౌండ్ లెవెల్ నిల్వ ఎరువులు సమానంగా ఉండాలన్నారు. అధిక ధరలకు విత్తనాలు అమ్మవద్దన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మల్యాల త్రిసంధ్య, లవణ్, దివ్య, అక్రముల్లా ఖాన్, సాయి, ఎరువుల దుకాణ యజమానుదారులు పాల్గొన్నారు.

# అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,సూర్య మేజర్ న్యూస్ నవంబర్ :** అటవీ భూముల అక్రమ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో డి. సి. పి. ఎ.భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ లతో కలిసి పోలీస్, రెవెన్యూ, అటవీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ భూముల అక్రమ ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరైన అనుమతులు లేకుండా అటవీ భూములను ఆక్రమించిన, వృక్షాలను నరికిన క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి అటవీ భూముల రక్షణకు చర్యలు తీసుకోవాలని, నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గంజాయి వద్దు... అక్షరం ముద్దు




**వాంకిడి, నవంబర్ 10,సూర్య మేజర్ న్యూస్** జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు, జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వాంకిడి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు."గంజాయి వద్దు... అక్షరం ముద్దు" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో షీ టీం, మానవ అక్రమ రవాణా విభాగం, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులకు డ్రగ్స్, బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. అమ్మాయిలు చదువును ఆపకుండా ఉన్నత విద్య కొనసాగించాలని, బాల్యవివాహం ఒక సామాజిక నేరమని గుర్తు చేశారు. చిన్న వయసులో ద్విచక్రవాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఓటిపీ, వ్యక్తిగత వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదిగి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏ ఎస్సై పోషన్న, రామచందర్,శ్రీనివాస్,చంద్రశేఖర్,సంఘవి, రజిత పోలీసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.నటరాజ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్ విద్యార్థులు పాల్గొన్నారు.

### సమాచార హక్కు చట్టం పై అవగాహన సదస్సు

**సోన్ నవంబర్ 10 సూర్య మేజర్ న్యూస్:** ప్రభుత్వ ఉన్నత పాఠశాల సోన్ లో ఆర్టీఐ సామాజిక కార్యకర్తల ఫోరం తెలంగాణ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సయ్యద్ కలీం మాట్లాడుతూ విద్యార్థులకు దరఖాస్తు చేసే విధానంపై అవగాహన కల్పించారు. తదనంతరం మాట్లాడుతూ మానవ హక్కులు ఇతర చట్టాల పైన విద్యార్థులు పూర్తిస్థాయి అవగాహనతో ఉండి సమాజ మార్పు కోసం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కె.ఆరాధన,జిల్లా ప్రచార కార్యదర్శి నవీన్, సారంగాపూర్ మండల బాధ్యులు సయ్యద్ అలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### రాజీమార్గమే రాజమార్గం - ఈ నెల 15న ప్రత్యేక లోక్ అదాలత్
### - మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి విజ్ఞప్తి

**రామకృష్ణాపూర్, నవంబర్ 10, సూర్య మేజర్ న్యూస్**

వివాదాలను పరిష్కరించుకోవడంలో రాజీమార్గమే ఉత్తమమైనది అని మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. న్యాయం కోసం కాలం,ధనం వృథా చేసుకోవడం కంటే,పరస్పర సయోధ్యతో రాజీ కుదుర్చుకోవడం ద్వారా వేగవంతమైన న్యాయం పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించబోయే ప్రత్యేక లోక్ అదాలత్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. మందమర్రి సర్కిల్ పరిధిలోని మందమర్రి,రామకృష్ణాపూర్,కాశీపేట, దేవపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, "లోక్ అదాలత్ అనేది కేసుల పరిష్కారానికి అద్భుత వేదిక. చిన్న చిన్న కేసులు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, చెక్ బౌన్స్, చిన్నపాటి సివిల్ తగాదాలు వంటి అంశాలను ఇరుపక్షాల రాజీతో త్వరగా పరిష్కరించుకోవచ్చు.దీని ద్వారా కోర్టుల చుట్టూ తిరుగుతున్న సమయం, ఖర్చు ఆదా అవ్వడంతో పాటు పరస్పర సంబంధాలు మెరుగుపడతాయి," అని వివరించారు. ప్రజలందరూ ఈ లోక్ అదాలత్‌లో పాల్గొని, తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకొని, వేగవంతమైన న్యాయం పొందాలని ఆయన ఆయన పేర్కొన్నారు.

### ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వ్యక్తి ఊరివేసుకుని ఆత్మహత్య

**ముధోల్ నవంబర్ 10, సూర్య మేజర్ న్యూస్.**

ఆదివారం కనకపురం రవి (35) సంవత్సరాలు వృత్తిరీత్యా ఆటో డ్రైవర్ మహాలక్ష్మి గల్లీ, గత 2 సంవత్సరాల క్రితము ఆక్సిడెంట్ అయినప్పటి నుండి ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఉరి వేసుకొని మరణించాడు. అయితే మృతుని భార్య కనకపురం లావణ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరాలు తెలియాల్సి ఉందని బి పెర్సిస్ సబ్-ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ముధోల్ తెలియజేసారు.

# ప్రముఖ కవి గాయకుడు

## అందెశ్రీ కి విద్యార్థుల అశ్రునివాలి

**సోన్ నవంబర్ 10 సూర్య మేజర్ న్యూస్:**

ప్రముఖ కవి, గాయకుడు అందెశ్రీ మరణం పట్ల జాఫ్రాపూర్ పాఠశాల విద్యార్థులు సోమవారం శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన రాసిన తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ అనే పూర్తి పాటను పాడి శ్రద్ధాంజలి ఘటించారు. ఎంఈఓ తొడిశెట్టి పరమేశ్వర్ విద్యార్థులకు అందెశ్రీ గురించి, ఆయన మంచి కవి గాయకుడని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



### లంచాలు ఇస్తేనే పనులు చేస్తున్నారని సబ్ కలెక్టర్కు ఫిర్యాదు
### - ఎమ్మార్వో కార్యాలయంలో 2020 నుండి పెండింగ్లో ధ్రువీకరణ పత్రాలు - ముంజం ఆనంద్ కుమార్

**కాగజ్నగర్, నవంబర్ 10, సూర్య మేజర్ న్యూస్ :**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో గత 2020 సంవత్సరం నుండి మీసేవ ద్వారా అప్లై




చేసుకున్న కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు వందల సంఖ్యలో పెండింగ్లో ఉన్నాయని, మండల రెవెన్యూ అధికారులు మీసేవ ద్వారా అప్లై చేసుకున్న ధ్రువీకరణ పత్రాలను ఎప్పటికప్పుడు సమీక్షించకపోవడం వలననే ఇలా అప్లై చేసుకున్న ప్రజల పనులు కాక నానా ఇబ్బందులు పడుతున్నారని, మండల రెవెన్యూ కార్యాలయంలో పైరవీలు, లంచాలు ఉన్నవారికే పనులు జరుగుతున్నాయని, డబ్బులు ఇవ్వనిదే కాగితాలు కదలడం లేదని, ఈ విషయంపై తహసీల్దార్ కూడా స్పందించడం లేదని కావున ఈ పెండింగ్లో ఉన్న ధ్రువీకరణ పత్రాలు త్వరగా జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కాగజ్నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలోని డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వరలక్ష్మికి ఈరోజు సోమవారం మెమోరండం ఇచ్చిన సిపిఎం పార్టీ నాయకులు ముంజం ఆనంద్ కుమార్.ఈ కార్యక్రమంలో వసాకే సాయి,కూచిపూడి ఏసు కుమార్, తిమోతి పాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్

**సోన్, నవంబర్ 10 సూర్య మేజర్ న్యూస్:**

మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన నిర్మల్ గురుకుల్ హైస్కూల్ ప్రిన్సిపల్ అబ్బాస్ మాతృమూర్తి ఆదివారం అనారోగ్యంతో



మరణించడంతో విషయం తెలుసుకున్న ట్రస్మ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ సోమవారం అబ్బాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి మాతృమూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయనతో పాటు ట్రాస్మా నిర్మల్ టౌన్ అధ్యక్షులు అయ్యన్న గారి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ ప్రకాష్ , రాష్ట్ర ట్రస్మా ఈసీ సభ్యుడు షబ్బీర్ అహ్మద్, సభ్యులు ఎల్లయ్య , జయరాజ్ తదితరులు పరామర్శించారు.

### కలెక్టర్ కు పలు సమస్యలతో కూడిన మెమోరాండం

**నేరడిగొండ,సూర్య మేజర్ న్యూస్:** మండలంలోని పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ రాజర్షిషా కు సోమవారం లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ అందజేశారు. మండల కేంద్రంలో ప్రతి శనివారం వారసంతాను నడిరోడ్డుపై నిర్వహిస్తున్నారని దీంతో రాకపోకలకు వాహనాలకు ప్రజలకు ఇబ్బంది పడుతున్నారని, అలాగే అంగడి బజారులో మూత్రశాలలు మరుగుదొడ్లు లేక మహిళలు నానా ఇబ్బందులు



పడుతున్నారని పేర్కొన్నారు, వెంటనే ఐబి గ్రౌండ్ కు అంగడి బజార్ ని మార్చాలని, అలాగే మండలంలోని ప్రభుత్వ ధరఖానలో 24 గంటలు డాక్టర్లు ఉండేలా చూడాలని, రాత్రి సమయంలో డాక్టర్ లేక ప్రజలు రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారని మెమోరాండంలో పేర్కొన్నారు, ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని తెలియజేశారు. వెంటనే సమస్యల ను పరిష్కరించాలని, సమస్యలతో కూడిన మెమోరండం ను కలెక్టర్ కు ప్రజా సంఘాల నాయకులు పౌరులు అందజేసినారు.

### పట్టుబడ్డ పేకాట రాయుళ్లు

**ఖానాపూర్ టౌన్ నవంబర్ 10 సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని వెంకట సాయి లాడ్జిలో పేకాట ఆడుతూ ఆరుగురు పట్టు పడ్డారు. వీరి నుండి 35,600 రూపాయల నగదు, 6 సెల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకొని కేసు రిజిస్టర్ చేసినట్లు,ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. వీరి యొక్క ఆన్లైన్ లావాదేవీలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపినారు.